VISION BHARATH REPORTER
విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారే" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్,
MOBILE:
9494498787,9440232308.

# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.LL.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 04-07-2024 సంపుటి : 06 సంచిక : 288 పేజీలు : 8 వెల : రూ 3-00

# రాజ్యసభలో ఇండియా కూటమి పార్టీల వాకౌట్



న్యూఢిల్లీ : బుధవారం రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తుండగా జోక్యానికి ప్రతిపక్ష నాయకుడు (ఎల్‌ఒపి) మల్లికార్జున్ ఖర్గేకు అనుమతి లభించకపోవడంతో కాంగ్రెస్ నాయకత్వంలో ఇండియా కూటమి పార్టీలు సభలో నుంచి వాకౌట్ చేశాయి. పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే

## ప్రధాని మోడీ ప్రసంగం మధ్యలో వారి నిరసన
## మోడీ మాట్లాడుతుండగా ప్రతిపక్షాల నినాదాల హోరు
## వాకౌట్‌ను నిరసించిన సభ ఛైర్మన్ ధన్‌ఖర్
## రాజ్యసభ నిరవధిక వాయిదా

తీర్మానంపై చర్చకు ప్రధాని మోడీ సమాధానం ఇస్తుండగా ఎల్‌ఒపి ఖర్గే జోక్యం చేసుకోవాలని అనుకున్నారు. కానీ ఖర్గే విజ్ఞప్తులను ఛైర్మన్ జగ్దీప్ ధన్‌ఖర్ తిరస్కరించారు. దీనితో ఇండియా కూటమి ఎంపిలు నినాదాలు చేస్తూ, ఎల్‌ఒపి ఖర్గేని మాట్లాడనివ్వాలని కోరారు. వారి నినాదాల మధ్య మోడీ తన ప్రసంగం కొనసాగించారు. ఇది కొంత సేపు కొనసాగింది. తనను మాట్లాడనివ్వాలని ఖర్గే పదే పదే అభ్యర్థించారు.ఖర్గేకు ఎట్టకేలకు అనుమతి లభించినప్పుడు ఇండియా కూటమి ఎంపిలు సభలో నుంచి వాకౌట్ చేశారు. వారి వాకౌట్‌ను ధన్‌ఖర్ ఖండించారు. అది రాజ్యాంగానికి అవమానకరం అని ఆయన అన్నారు. మోడీ కూడా వారి వాకౌట్‌ను గర్హించారు. తాను స్వప్రయోజనం కోసం ప్రయత్నించడం లేదని, కానీ తన ప్రభుత్వ పని తీరును వివరించడం తన కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానాన్ని రాజ్యసభ ఆమోదించిన అనంతరం సభ నిరవధికంగా వాయిదా పడింది. జూన్ 27న మొదలైన రాజ్యసభ 264వ సెషన్ ధన్యవాదాల తీర్మానానికి ప్రధాని మోడీ సమాధానం ఇచ్చిన తరువాత తీర్మానాన్ని ఆమోదించిన పిమ్మట సభ వాయిదా పడింది. లోక్‌సభను మంగళవారం నిరవధికంగా వాయిదా వేసిన విషయం విదితమే.

**ప్రతిపక్షం వాకౌట్ 'ప్రమాదకర సంప్రదాయం': ధన్‌ఖర్**

ప్రధాని మోడీ సమాధానం ఇస్తున్న సమయంలో వాకౌట్ చేయడం ద్వారా ప్రతిపక్షం 'ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన ప్రమాదకర సంప్రదాయాన్ని' నెలకొల్పిందని రాజ్యసభ ఛైర్మన్ జగ్దీప్ ధన్‌ఖర్ బుధవారం విమర్శించారు. సభను నిరవధికంగా వాయిదా వేసే ముందు ధన్‌ఖర్ ముగింపు ఉపన్యాసం ఇస్తూ, సెషన్ సమయంలో సభాధ్యక్షుని వేదిక ముందుకు ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే రావడం 'పార్లమెంటరీ ప్రవర్తనకు, ఔచిత్యానికి అవమానకరం' అని కూడా ధన్‌ఖర్ వ్యాఖ్యానించారు. సెషన్ కార్యక్రమాలపై ఛైర్మన్ వివర ణ ఇస్తూ, అధికార పక్షం, ప్రతిపక్షం నుంచి సభ్యులు చురుకుగా పాల్గొనగా, కొన్ని వ్యాఖ్యలు 'కార్యకలాపాలను దెబ్బ తీసిన అంతరాయాలు నన్ను బాగా కలచివేశాయి' అని చెప్పారు. 'అనుభవజ్ఞులైన సభ్యులు బాధ్యతారహితంగా ప్రవర్తించడం ముఖ్యంగా బాధాకరం.అంతరాయం ముందు పేర్కొన్న కార్యకలాపాలను అడ్డుకోవడమే కాకుండా ఈ ప్రసిద్ధ వ్యవస్థ ప్రతిష్ఠను కూడా దెబ్బ తీస్తుంది' అని ఆయన స్పష్టం చేశారు. ఖర్గే శుక్రవారం రాజ్యసభ వెల్‌లోకి ప్రవేశించడాన్ని ధన్‌ఖర్ ప్రస్తావిస్తూ, 'తుదకు ప్రతిపక్ష నాయకుడు కూడా సభ వెల్‌లోకి రావడం ఎంతైనా బాధాకరం. అది పార్లమెంటరీ ప్రవర్తనకు, ఔచిత్యానికి అవమానకరం' అని పేర్కొన్నారు. 'ఈ సభ సమాలోచనలు, చర్చలు, సంభాషణల ఆలయం కావడానికి వీలుగా సభ్యులు తమ ప్రవర్తనను చూపాలి' అని ఆయన కోరారు. 'ఇప్పుడు వారి వాకౌట్ తీవ్ర బాధాకరం, ఇది చారిత్రక సందర్భం. ప్రభుత్వం మూడవ టెర్మ్‌లో ఉ ంది. ప్రధాని ఆరు దశాబ్దాల తరువాత ప్రభుత్వానికి వరుసగా సారథ్యం వహిస్తున్నారు. వారు తమ రాజ్యాంగ బాధ్యతల నుంచి వాకౌట్ చేశారు.


## 'గత డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్నవారికి మెగా డీఎస్సీలో ఫీజు మినహాయింపు' మంత్రి నారా లోకేశ్

అమరావతి, జులై 3: మెగా డీఎస్సీ, టెట్ పరీక్షలకు సంబంధించి మంత్రి నారా లోకేష్ కీలక ప్రకటన చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు గత ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను చంద్రబాబు సర్కార్ రద్దు చేసిన సంగతి తెలిసిందే.బదులుగా 16,347 పోస్టులకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. అయితే రద్దైన గత డీఎస్సీకి దరఖాస్తు చేసిన వారికి మెగా డీఎస్సీలో ఫీజు మినహాయింపు ఇవ్వాలని



మంత్రి నారా లోకేశ్ నిర్ణయించారు. వారి నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయకుండా.. ఎలాంటి విమర్శలకు తావులేకుండా మెగా డీఎస్సీని పకడ్బందీగా నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సచివాలయంలో మంగళవారం టెట్, డీఎస్సీ నిర్వహణపై అధికారులతో జరిపిన సమీక్షలో పేర్కొన్నారు.టెట్‌కు మెగా డీఎస్సీకి మధ్య ప్రిపరేషకు ఎక్కువ సమయం ఉండాలని అభ్యర్థుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయన్నారు. డీఎస్సీ నిర్వహణకు అభ్యర్థులు, యువజన సంఘాల నుంచి అభిప్రాయాలు సేకరించాలని ఆయన అన్నారు. అలాగే పాఠశాలల్లో హేతుబద్ధీకరణకు తీసుకొచ్చిన జీఓ ? 117 వల్ల కలిగిన నష్టంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఏపీ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది డిమాండ్లపై అధ్యయనం చేసి, వారికి నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని ఆయన ఆదేశించారు.మరోవైపు మెగా డీఎస్సీలో వయోపరిమితి సడలింపుపై కూడా మంత్రి లోకేష్ అధికారులతో చర్చలు జరిపారు. దీనిపై కూడా తగు నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. మెగా డీఎస్సీలో కొన్ని జిల్లాలకు ఎస్జీటీ పోస్టులు తక్కువగా ఉన్నాయని పలువురు తన దృష్టికి తెచ్చారని మంత్రి ప్రస్తావించారు. దీనికి అధికారులు సమాధానం ఇస్తూ.. ప్రకాశం జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులపై కొంతమంది కోర్టును ఆశ్రయించారని, దీనివల్ల పోస్టులు తగ్గాయని అధికారులు వెల్లడించారు.

# అమరావతి విధ్వంసం...ఓ కేస్ స్టడీ




## జగన్ ఐదేళ్ల పాలనలో అమరావతి విధ్వంసం
## మళ్లీ అమరావతికి ప్రాణప్రతిష్ట చేసి తీరుతాం
## ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా నిర్మిస్తాం
## ప్రతి తెలుగు బిడ్డ అమరావతి గర్వంగా చెప్పుకునేలా చేస్తా
## మళ్లీ పెట్టుబడిదారుల విశ్వాసం చూరగొంటాం
## దేశంలోని పవిత్ర జలాలు, మట్టి ఇక్కడ చేరుకున్నాయి
## అందుకే మహిమాన్విత ప్రాంతాన్ని ఏమీ చేయలేకపోయారు
## గోదావరి, కృష్ణా నదుల మధ్యలో ఉండేలా అమరావతికి శ్రీకారం
## త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టి..అద్భుత నగరంగా తీర్చిదిద్దుతాం
## అమరావతి విధ్వంసంపై శ్వేతపత్రం విడుదల చేసిన సిఎం చంద్రబాబు

అమరావతి,జూలై3: ప్రపంచంలోనే అతిపెద్ద భూ సేకరణ ప్రాజెక్టు అమరావతి అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రపంచం మెచ్చేలా రాజధాని నిర్మించాలని సంకల్పించి, అతిపెద్ద భూసేకరణ చేశామని, కానీ గత ఐదేళ్ల కాలంలో జగన్ దానిని విధ్వంసం చేశారని అన్నారు. ఇప్పుడు ఎన్ని కష్టాలు ఎదురైనా పునర్నిర్మాణం చేసి తీరుతామని ప్రకటించారు. ఇది ఏ ఒక్కరి రాజధాని కాదు.. యావత్ రాష్ట్ర ప్రజలదని తెలిపారు. ప్రతి తెలుగు బిడ్డ అమరావతి నాది అని గర్వంగా గుర్తించాలి.. చెప్పుకోవాలన్నారు. కొత్తగా ప్రణాళికలు ఏమీ లేవని, పాత వాటినే కొనసాగిస్తూ నిర్మాణం చేస్తామని తెలిపారు. రాజధాని అమరావతిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం శ్వేతపత్రం విడుదల చేశారు. ఉద్యోగ, ఉపాధి కోసం తాను అమరావతిని నిర్మించాలని చూస్తే జగన్ విధ్వంసం సృష్టించారని పూర్తి వివరాలు ప్రకటించారు. జగన్ ప్రభుత్వం చేసిన అరాచక పనుల కారణంగా వరల్డ్ క్లాస్ క్యాపిటల్‌గా మారాల్సిన అమరావతి ఇప్పుడు దెబ్బతిన్నదన్నారు. అమరావతిలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. ఇప్పుడు ప్రజలు, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచుకుంటామన్నారు. అమరావతి అనేది ఆ కాలంలో ప్రముఖ నగరం. రాష్ట్ర విభజన జరుగుతుందని, అమరావతి రాజధాని అవుతుందని ఎవరూ ఊహించలేదు. రాజధానికి అమరావతి పేరు పెట్టాలని రామోజీగ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు సూచించారు. అమరావతి పేరును క్యాబినెట్‌లో వందశాతం అంగీకరించారు. ప్రతి గ్రామం నుంచి మట్టి నీరు తెచ్చి అమరావతిలో ఉంచాం. యమునా నది నీరు, పార్లమెంట్ మట్టిని ప్రధాని మోదీ తెచ్చారు. దేశంలోని ప్రముఖ దేవాలయాల పవిత్ర జలం, మట్టి తెచ్చాం. ఆ పవిత్ర జలం, మట్టి మహిమ అమరావతిలో ఉంది. అందుకే అమరావతిని ఎవరూ కదిలించలేక పోయారు. రాష్ట్రంలో ఎటుచూసినా సమదూరంలో ఉన్న ప్రాంతం ఇది. రాష్ట్ర భవిష్యత్తును ఆకాక్షించే ఎవరైనా అమరావతిని ఒప్పుకోవాలి. విజయవాడ, గుంటూరు మధ్యే రాజధాని ఉండాలని శివరామకృష్ణ కమిటీ కూడా చెప్పింది. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన అనుభవం నాకు ఉంది. తొమ్మిదేళ్లలో సైబరాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేశాం. కృష్ణానది నుంచి నీళ్లు తెచ్చి



సైబరాబాద్‌కు ఇచ్చాం. 29 వేల మంది రైతులు 34,400 ఎకరాలు రాజధాని కోసం ఇచ్చారు. రైతులు ఇచ్చిన భూమికి ఏటా పరిహారం ఇచ్చాం. పదేళ్ల వరకు పరిహారం ఇస్తామని రైతులకు చెప్పాం. రైతు కూలీలకు కూడా పరిహారం ఇచ్చాం. రైతులు ఇచ్చింది, ప్రభుత్వ భూమి కలిపి 53,745 ఎకరాలు సమకూ రింది. రాజధాని రాష్ట్రానికి నడి మధ్య నే ఉండాలని ఆనాడు ప్రతిపక్షనేతగా జగన్ చెప్పారు. కానీ, అధికారంలోకి వచ్చాక జగన్ ఏం చేశారో ప్రజలే చూశారు. దేశంలో ఏ నగరానికి లేని సౌలభ్యత అమరావతికి ఉంది.

# ఉప్పాడ తీరం కోతలపై అధ్యయనం



కాకినాడ,జూలై3: ఉప్పాడ తీరం భారీగా కోతకు గురవుతోంది. గత ఏడాదిన్నర కాలంగా ఏకంగా ఎకరం మేర భూభాగం సముద్రంలో కలిసిపోయింది. తీరం తీవ్రంగా ధ్వంసమైంది. ఈ కోతను ఆపేందుకు చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్ ఇప్పటికే చెప్పారు. చెన్నై నుంచి వచ్చే నిపుణుల బృందం ఉ ప్పాడ తీరాన్ని పరిశీలించి దాన్ని రక్షణకు అవసరమైన చర్యలు సూచిస్తుందని, తదనుగుణంగా తీర సంరక్షణ చేపడతామని హామీ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మూడో రోజు కాకినాడ జిల్లాలో పర్యటిస్తున్నారు. వాకతిప్ప ఫిషింగ్ హార్బర్, సూరప్ప తాగునీటి చెరువుతో పాటు ఉప్పాడలో కోతకు గురైన తీరప్రాంతాన్ని పవన్ బుధవారం పరిశీలించారు. తీర ప్రాంతం కోతకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో ఆయన చర్చించారు. అంతకు ముందు స్థానిక నేతలు, జనసేన కార్యకర్తలు

## నిపుణుల సలహా మేరకు చర్యలు
## ఉప్పాడ తీరాన్ని పరిశీలించిన పవన్ కళ్యాణ్
## కారణాలను అధికారులతో చర్చించిన డిప్యూటీ సిఎం
## ఉప్పాడకు చేరుకున్న పవన్ కళ్యాణ్‌కు ఘనంగా స్వాగతం

డిప్యూటీ సీఎంకు ఘనస్వాగతం పలికారు. పలువురు ఆయన వాహనంపై పూలు చల్లి అభిమానం చాటారు.ఉప్పాడ తీరంలో ఏడాదిన్నర కాలంగా ఎకరం భూభాగం సముద్రపు కోతలో కలిసిపోయిందని. ఇలా ధ్వంసం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఉ మ్మడి తూర్పు గోదావరి జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. కేరళలో అధ్యయనం చేసిన తర్వాత కోనసీమలో కొబ్బరి ఉత్పత్తులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధుల సాయంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సైన్సు అండ్ టెక్నాలజీని అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే నన్నయ్య యూనివర్సిటీలో ఉన్న రీసెర్చ్ స్కాలర్లను తీసుకెళ్లి ఉప్పాడ తీరసంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేస్తామని చెప్పారు.కేంద్రంఇస్తున్నజలజీవన్‌మిషన్‌నిధులనుపూర్తిస్థాయిలో వినియోగించుకుని అన్ని గ్రామాలకు రక్షిత తాగునీరందిస్తామని చెప్పారు. జనావాసాల్లో ఉన్న తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పు గోదా వరి జిల్లాలో ఏడాదికి వెయ్యి కోట్ల ఇసుక వ్యాపారం జరిగిందని ఐదేళ్లలో రూ.5 వేల కోట్ల రాబడి వచ్చినా జగన్ ప్రభుత్వం మాత్రం పంచాయతీల నిధులకు గండి కొట్టింద న్నారు. గనుల సీనరేజీ నిధులు సైతం ఇవ్వ కుండా దారి మళ్లించారని వీటన్నింటిపై అధికారులను నివేదిక కోరినట్టు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెప్పారు.

# వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి భారీ షాక్

## సీబీఐ, ఈడీ కేసులపై ఇక రోజువారీ విచారణ
## తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు
## కేసు మూడు వారాలకు వాయిదా

హైదరాబాద్,జూలై3(: వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి భారీ షాక్ తగిలింది. ఆయనపై నమోదైన సీబీఐ, ఈడీ కేసుల విచారణలను రోజువారీగా చెపట్టాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. జగన్‌పై నమోదైన సీబీఐ, ఈడీ కేసులను రోజువారీ విచారణ చేపట్టి తేల్చేసేలా హైదరాబాద్ సీబీఐ కోర్టుకు ఆదేశాలివ్వాలంటూ హరిరామజోగయ్య తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు పిల్ దాఖలు చేశారు.. సీబీఐ, ఈడీ కేసులు లేని నేతను ఎన్నుకోవాలని ప్రజలు అనుకుంటున్నారని.. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసుల్లో నిందితుడైన జగన్ వరుస పిటిషన్లు వేసి విచారణలో జాప్యం చేస్తున్నారన్నారు. ఈ పిటిషన్ ను ఎన్నికలకు ముందే దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు.. జగన్ కేసులను రోజువారీ విచారణ చేపట్టాలని ఆదేశించింది. ఈ క్రమంలో మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. జగన్ కేసులపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. సీబీఐ కోర్టులో ఉన్న జగన్ కేసులను రోజువారీ విచారణ చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది. దీనిపై వాదనలు వినిపించిన ప్రభుత్వ న్యాయవాది కోర్టులో దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. తదుపరి విచారణను హైకోర్టు 3 వారాలకు వాయిదా వేసింది.

ఇదిలావుంటే జగన్ కేసుల విచారణ వేగంగా సాగడం లేదని ఇతర రాష్ట్రాలకు బదిలీ చేయాలని మాజీ ఎంపీ, ప్రస్తుత ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఎందుకు ఆలస్యమవుతోందని సుప్రీంకోర్టు సీబీఐని ప్రశ్నించింది. నిందితులు వరుసగా వివిధ రకాల పిటిషన్లు వేయడం వల్లనే ఆలస్యం అవుతుందని సీబీఐ తెలిపింది. లోయర్ కోర్టులో వాయిదాలతో తమకు సంబంధం లేదని సీబీఐ తరపు న్యాయవాది న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఇంతకాలం నుంచి ఒక్క డిశ్చార్జ్ పిటిషన్ అన్నా పరిష్కరించారా అని సుప్రీంకోర్టు ధర్మాసనం అప్పట్లో ప్రశ్నించింది. జగన్ క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారని పేర్కొంటూ హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ, ఈడీలు మొత్తం 20 చార్జిషీట్‌లు దాఖలు చేశాయి. ఈ కేసులపై సీబీఐ కోర్టులో గత 12 ఏళ్లుగా విచారణ కొనసాగుతూనే ఉంది. ఆయా చార్జిషీట్ల నుంచి తమను తప్పించాలని కోరుతూ జగన్, విజయసాయిరెడ్డి సహా ఇతర నిందితులు దాఖలు చేసిన 130 డిశ్చార్జి పిటిషన్‌లపై తీర్పు వెల్లడి కాలేదు

# సంపాదకీయం

గురువారం 04-07-2024

## పార్లమెంట్ ప్రతిష్ఠను దిజార్చరాదు !

లోక్‌సభలో విపక్షాల బలం పెరగడంతో సమస్యలపై చర్చకు అవకాశం వచ్చింది. దేశం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై చర్చ చేయడానికి కార్యాచరణతో ముందుకు రావాలి. బలమైన విపక్షంగా కాంగ్రెస్ మంచి నిర్ణయం తీసుకోవాలి. ప్రభుత్వానికి వణుకు పుట్టించేలా పనిచేయాలి. అంతేగానీ హిందువులను నిందించడం లేదా, గోలచేయడం ద్వారా ప్రజల సమస్యలను ప్రస్తావించలేదు.పార్లమెంటరీ ప్రజాస్వామ్యం లో పనితీరు ముఖ్యం. అయితే అందుకు భిన్నంగా విపక్ష నేతలు వ్యవహరిస్తూ..పార్లమెంట్‌ను అపహాస్యం చేస్తున్న తీరు గర్హనీయం. పద్ధతులు, సంప్రదాయాలు కొనసాగించాల్సిన విపక్షం అందుకు భిన్నంగా వ్యవహరించడం దారుణం కాక మరోటి కాదు. విపక్షనేత రాహుల్ హిందువులను ఉద్దేశించిన చేసిన వ్యాఖ్యలు దారుణం. ఈ దేశం ఎంతగా గాయపడ్డదో..ఎంతగా చితికి పోయిందో చరిత్ర చదివి తెలుసు కోవాలి. ప్రధాని అన్నట్లుగా రాహుల్ నిజంగానే పిల్ల చేష్టలు చేస్తున్నారు. ఆయనకు హుందాతనం లేకుండా పోయింది. హిందువులను ఉగ్రవాదులుగా చిత్రీకరించే ప్రయత్నం చేసిన తీరు దుర్మార్గం. హిందువుల ఉగ్రవాదులు అయితే ఈ దేశంలో దాడులు జరిగేవి కావు. ముస్లింలు, కుషాణులు, బ్రిటిషర్లు, ఫ్రెంచ్, డచ్చ్ వారు ఇక్కడకు వచ్చే ధైర్యం చేసేవారు కాదు. భారతీయులు శాంతికాముకులు కనుకనే వీరంతా దాదాపు 15,16 శతాబ్దాలు పాలించారు. ఇక్కడ ఆలయాలను ధ్వంసం చేసినా, మతమార్పిడులు చేసినా, మానభంగాలు చేసినా, ఆస్తులను ధ్వంసం చేసినా, నలందా లాంటి విశ్వవిద్యాలయాలను తగులబెట్టినా సహించారు. దేశాన్ని ముక్కలు చేసినా సహించారు. ఇవన్నీ చరిత్ర. కాల్పనికం కాదు. వీటిని రాహుల్ చదివి అర్థం చేసుకోవాలి. కుటుంబ పరంగా అందలం దక్కించుకున్న రాహుల్ భారతీయులు గురించి తెలుసుకోవాలి. పార్లమెంటులో ఏదేని అంశంపైనా చర్చకు ఓ పద్దతి, నిబంధనలు ఉంటాయి. వాటిని గుర్తించి చర్చ చేయించేలా, ప్రభుత్వాన్ని నిలదీయాలి. కానీ రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ప్రధాని సమాధానం ఇస్తున్న సమయంలో చేపల మార్కెట్లో లాగా నినాదాలు చేయడం, అల్లరి చేయడం ప్రజాస్వామ్యం అనిపించుకోదు. ప్రధాని ప్రసంగం వినడం ఇష్టం లేకపోతే పార్లమెంటును వీడాలి. అంతేగానీ గోలచేయడం దారుణం.చివరకు పెద్దల సభలో కూడా గోలచేసిన తీరు క్షంతవ్యం కాదు. లోక్‌సభలో గంటల పాటు గోల చేస్తున్నా..వారిని రాహుల్ వారించక పోవడం రాహుల్ పిల్లచేష్టలకు పరాకాష్టగా చూడాలి. ప్రధాని, మంత్రుల, విపక్ష సభ్యులు అంతా కూడా పార్లమెంటులో చిత్తశుద్ధితో పనిచేయాలి. సమస్యలను పరిష్కరించకున్నా ఫర్వాలేదు. కానీ వాటిపై చర్చకు ఆస్కారం ఇవ్వాలి. దేశంలో ఉన్న సమస్యలు కనీసం ప్రజలకైనా తెలియాలి. ప్రజలు ఏయే సమస్యలు ఎలా ఎదుర్కొంటున్నారో పార్లమెంటులో చర్చ ద్వారా దేశ ప్రజలు గుర్తించాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు ఎన్నడూ జరగనన్ని నేరాలు, ఘోరాల సంఘటనలు దేశంలో అన్ని రాష్ట్రాల్లోనూ అనేకం జరుగుతన్నాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా ఇవన్నీ ప్రస్తావించాల్సి ఉండేది. నీట్‌పైనా ప్రస్తావించారు. వీటికి ప్రధాని సమాధానం ఇస్తున్న సమయంలో నిలదీసే అవకాశం కూడా ఉంది. కానీ విపక్షం అలా చేయకుండా గోలతో పార్లమెంటును మార్కెట్‌కన్నా అధ్వాన్నంగా చేశారు. స్కూళ్లో పిల్లలు అల్లరి చేస్తే టీచర్లు దండస్తారు. ఇక్కడ వీరిని ఎవరు దండించాలి. ఇలాంటి వారు పార్లమెంట్ సభ్యులగా అర్హులా అన్నది తేల్చాలి. ఇలాంటి వారిపై కఠినచర్యలు తీసుకోక పోవడంపై మార్పు కానరావడం లేదు. పార్లమెంట్ అంటే మోడీ లేదా విపక్ష పార్టీలకో సంధించిన వ్యవహారం కాదు. ఇది దేశ ప్రజల ఆస్తి. వీరు సమస్యలను చర్చించి పరిష్కరించాలని ప్రజలు ఎన్నుకుని పంపారు. దేశం అనేకానేక సమస్యలు ఎదుర్కొంటోంది. వాటిపైన చర్చచేయాలి. ఎవరు బాధ్యులో ఎవరు బాధ్యులు కాదో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఐటి,ఇడి దాడుల పైనా చర్చించాలి. అక్రమా లను నిలదీయాల్సిందే. అందుకు ఎవరు కూడా మినహాయింపు కాదు. ప్రధాని మోడీ చెప్పిన లెక్కలపై కసరత్తు చేసి,నిజాలు బయట పెట్టాలి. అలాగే రాష్ట్రాలకు నిధుల విషయంలో నిక్కచ్చిగా ఉండాలి. కేంద్ర పథకాల నుంచి వచ్చిన డబ్బులపైనా జవాబుదారీ తనం చూపాలి. కేంద్రం ఏయే పథకాల కిద ఎంతెంత డబ్బులు ఇచ్చాయో సిఎంలు ప్రకటించాలి. నిధులపై చర్చ చేయాలి. ఆ నిధులను ఇతర పథకాలకు మళ్లించడం జరిగితే వాటిపైనా చర్చించాలి. ప్రజలను మోసం చేస్తూ ఎంతకాలం ఇలా పరస్పర విమర్శలు చేసుకోవడం తగదు. కేంద్రం కూడా ఇరు రాష్ట్రాలపై బెదిరింపు ధోరణిలో వ్యవహరిస్తోంది. ఎంపిలు కూడా చట్టసభల్లో ప్రభుత్వాన్ని కలసికట్టుగా నిలదీసేలా కార్యాచరణ సిద్దం చేసుకోవాలి. కేంద్రం సమస్యలను పరిష్కరించడం లేదన్న విషయాన్ని దేశం దృష్టికి తీసుకుని రావాలి. సమస్యలను గట్టిగా నిలదీయలేక పోవడంతో కేంద్రం కూడా ఉదాసీనంగా ఉంటోంది. ప్రధాని మోడీ తన ప్రసంగంలో అనేకానేక అంశాలను ప్రస్తావించారు. అందులో సత్యాలు, అర్ధసత్యాలు కూడా ఉన్నాయి. సమస్యలపై చర్చ ద్వారా వీటిని ఎండగట్టవచ్చు. బడ్జెట్ సమావేశాలు ముమ్మందు రాబోతున్నాయి. ఈ సమయంలో కూడా చర్చ చేయవచ్చు. అలాగే ఆర్థికరంగాన్ని దివాళా తీయిస్తున్నా నగదు బదిలీ పథకాల ను ఎంతమాత్రం కొనసాగించడం సరికాదు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, నీట్ అవినీతి వంటివన్నీ చర్చకు అర్హమైన అంశాలే. అయితే వీటిపై చర్చ సాగాలి. ఎలాచేస్తే చర్చకు వస్తుందో పార్లమెంట్ సబ్యులు తెలుసుకోవాలి. గోల చేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావు. రాజకీయ లబ్ది నెరవేరదు కూడా. అందువల్ల బలమైన విపక్షం బలహీనమైన పనులు చేయరాదు. గోలచేయడ మానుకోవాలి. పార్లమెంటును సద్వినియోగం చేసుకోవాలి. అప్పుడే ప్రజలు విశ్వసిస్తారు.

## బాబాలకు పాలకులు సాగిలపడుతుంటే ఇలాంటి ఘటనలు తప్పవు : ఆప్ నేత సంజయ్ సింగ్




యూపీలోని హాథ్రాస్‌లో జరిగిన భోలే బాబా( సత్సంగ్‌లో విషాదం దేశవ్యాప్తంగా దుమారం రేపుతోంది. ఇంత పెద్దసంఖ్యలో ఓ ఆధ్యాత్మిక కార్యక్రమం జరుగుతున్నా ఆస్థాయిలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. తొక్కిసలాటలో దాదాపు 121 మంది మరణించారు. ఈ ఘటనకు బాధ్యులైన బాబా ఆచూకీ అంతుబట్టడం లేదు. ఇక మంగళవారం మధ్యాహ్నం 3.30 నిమిషాలకు .. సత్సంగ్ ప్రాంగణం వద్ద తొక్కిసలాట జరిగింది.కానీ ఆ ఘటన తర్వాత భోలే బాబా ఆనవాళ్లు దొరకడం లేదు. ఆయన పరారీలో ఉన్నట్టు పోలీసులు భావిస్తున్నారు. ఆ బాబా కోసం గాలింపు చర్యలు చేపడుతుండగా ఈ ఘటనపై దేశవ్యాప్తంగా కలకలం రేగింది. ఇక హథ్రాస్ తొక్కిసలాట ఘటనపై ఆప్ నేత సంజయ్ సింగ్ స్పందిస్తూ దేశంలో ప్రజల ప్రాణాలకు విలువలేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.ఓ వ్యక్తి ఏకంగా తన పేరిట బాబా బజార్‌ను నిర్మిస్తున్నా ఆయనపై ఎలాంటి నియంత్రణ లేదని అన్నారు. ఇది కేవలం హథ్రాస్‌లోనే కాదని, దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. హరియాణలో ఏం జరిగిందో మనమంతా చూశామని, హత్యాచార ఘటనలో దోషిగా తేలిన ఓ బాబా తాను కోరుకున్నప్పుడు బయటకు వస్తారని, ప్రభుత్వ యంత్రాంగం ఆయనకు సాగిలపడుతుందని అన్నారు. ఇలాంటి బాబాల మార్కెట్ దేశంలో ఓ వెలుగు వెలుగుతుంటే ఇలాంటి ఘటనలను ఎలా నియంత్రిస్తారని ప్రశ్నించారు.

## 'ఉచిత.. గిచిత.. ప్రయాణం లేదు! దిగండి..' ఆర్టీసీ బస్సు కండక్టర్ భాగోతం



వేములవాడ, జూన్ 3: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఆర్టీసీ ఉచిత ప్రయాణం రోజుకొక్క వివాదంలో ఇరుక్కుంటుంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని రేవంత్ సర్కార్ చెబుతున్నా..క్షేత్రస్థాయిలో మాత్రం మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు. తాజాగా వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చిన ఓ కుటుంబానికి చేదు అనుభవం ఎదురైంది. దర్శనం అనంతరం ఇంటికి బయల్దేరిని కుటుంబం సోమవారం సాయంత్రం జగిత్యాల బస్‌స్టాప్‌లో ఆర్టీసీ బస్సు ఎకేందుకు ప్రయత్నించారు. ఇంతలో వారిని డోర్ వద్ద అడ్డుకున్న లేడీ కండక్టర్ వారిని ఆర్టీసీ బస్సు ఎక్కకుండా అడ్డుకుంది.'ఉచిత.. గిచిత ప్రయాణం లేదు. ముందు తనిఖీ అధికారులు ఉన్నారు. వారు చూస్తే రూ.500 ఫైన్ విధిస్తారు' అంటూ సదరు బస్సు కండక్టర్ కస్సుబుస్సుమంది. ఆ వెంటనే సదరు కుటుంబ సభ్యులను కూడా బలవంతంగా కిందికి దించేసింది. దీంతో ఈ మొత్తం వ్యవహారాన్ని అదే బస్సులో ఉన్న తోటి ప్రయాణికులు వీడియో తీసి సోషల్ మీడియాల్ పోస్ట్ చేశారు. అది కాస్తా వైరల్‌గా మారడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.ఇలా బలవంతంగా బస్సు నుంచి కిందికి దింపడంతో సదరు కుటుంబసభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. చేసేదిలేక మరో బస్సు వచ్చేంత వరకు వేచి చూశారు. ఈ పంచాయితీ వేములవాడ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీకృష్ణ వద్దకు చేరడంతో అసలేం జరిగిందనే దానిపై ఆరా తీయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో సదరు బస్సు కండక్టర్‌ను పిలిపించి ఆమెను విచారించినట్టు తెలుస్తోంది. అయితే ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించిన మహిళా కండక్టర్‌పై ఎలాంటి చర్యలు తీసుకున్నారనే దానిపై ఇప్పటి వరకూ సమాచారం లేదు.

## నరుడే నారాయణుడని, మానవసేవయే మాధవసేవ యని చాటిచెప్పిన మహోన్నత మూర్తి స్వామి వివేకానంద

-నేడు స్వామి వివేకానంద వర్ధంతి



మతానికి కొత్త అర్థాన్ని, సేవకు పరమార్థాన్ని నిర్వచించి నరుడే నారాయణుడని, మానవసేవయే మాధవసేవ యని చాటిచెప్పిన మహోన్నత మూర్తి స్వామి వివేకానంద దేశ యువతకు సదా స్ఫూర్తిదాతగా నిలువాలని 1985లో భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజైన జనవరి 12ను జాతీయ యువజన దినోత్సవంగా నిర్ణయించింది.బలమే జీవనం...బలహీనతే మరణం..నువ్వు దేనినైతే ఆలోచిస్తావో ఆవిధంగానే తయారవుతావు. నిన్ను బలహీనుడిగా భావించుకుంటే చివరకు బలహీనుడివే అవుతావు..శక్తిమంతుడిగా భావించుకుంటే శక్తిమంతుడివే అవుతావు. సమస్త శక్తి నీలోనే ఉంది. దానినే విశ్వసించు, నీవు బలహీనుడవని ఎప్పుడూ తలపోయకు..ధీరుడవై నిలిచి నీలోని దివ్యత్వాన్ని ప్రకటించు...అంటూ సమస్త మానవాళిని భయం వదలి సమాజ సేవకు నడుంకట్టాలన్నారు స్వామి వివేకానంద. ఉక్కునరాలు, ఇనుపకండరాలు, వజ్రతుల్యమైన ధృడసంకల్పం, మొక్కవోని విశ్వాసం గల వందమంది యువకులు చాలు...ఈదేశాన్ని ప్రపంచంలో అన్ని రంగాలలో అగ్రగామిగా నిలుపడానికి అంటూ ఎలాంటి యువత నేడు అవసరమో వివరించారు ఆమహనీయుడు. స్వామి సంక్షిప్త జీవిత చరిత్రకలకత్తాకు చెందిన ప్రసిద్ధ న్యాయవాది విశ్వనాథ దత్తా, ఆయన సతీమణి భువనేశ్వరీదేవి దంపతులకు నలుగురు కుమార్తెలు. ఒక మగబిడ్డ కావాలని భువనేశ్వరీ దేవి శివున్ని ప్రార్థించింది. 1863 జనవరి 12తేదీ మకర సంక్రాంతి పర్వదినాన నరేంద్రనాథ్ జన్మించారు. ఆ శిశువే అనంతరం స్వామి వివేకానందుడిగా ప్రపంచ ప్రసిద్ధి చెందారు. చిన్నప్పుడు కొంటె పనులు చేసినా, పెంపుడు జంతువులతో ఆటలాడుతూ తల్లి చెప్పే భారత, రామాయణ ఇతిహాసాలను శ్రద్ధగా వినేవాడు.పాఠశాలలో చేరింది మొదలు కళాశాల స్థాయి వరకు ఆ బాలుడిలో అసాధారణ మేధాశక్తి, అద్భుత జ్ఞాపకశక్తిని చూసి సహవిద్యార్థులు, ఉపాధ్యాయులు సైతం ఆశ్చర్యపడేవారు. వివిధ క్రీడల్లో ప్రావీణ్యం చూపడంతోపాటు మూఢనమ్మకాలను నమ్మకుండా ధైర్యసాహసాలు ప్రదర్శించేవాడు. చిన్నప్పటినుంచే ధ్యానంపై దృష్టి నిలిపిన నరేన్ త్రాచుపాము సమీపించినా ధ్యానముద్ర వీడేవాడుకాదు. గదిలో బంధించినా నిరుపేదలను చూసి చలించి ఇంట్లో ఉన్నవన్నీ కిటికీలగుండా దానం చేసేవాడు. దేవుడంటే ఎవరు, ఎలా ఉంటాడో కనుక్కోవాలన్న తపనతో ఎంతమందిని అడిగి చూసినా ఫలితం లేకపోవడంతో దక్షిణేశ్వర కాళికాలయానికి వెళ్లి శ్రీరామకృష్ణ పరమహంసను కలుసుకున్నాడు. కోరుకుంటున్న శిష్యుడు, గురువు దొరికేనరికి రామకృష్ణులవారి సంతోషానికి, శిష్యుడి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. దైవసాక్షాత్కారం కోసం నిరంతర ధ్యానం చేశారు. పరివ్రాజకునిగా దేశసంచారం చేశారు. ఎన్నో క్షేత్రాలు తిరిగి భారతదేశంపై పూర్తి అవగాహనకు వచ్చారు. పేద ధనిక తేడాలకు కలత చెందేవారు. కన్యాకుమారి చేరుకుని ఆమె దివ్య సమక్షాన్ని అనుభూతి చెందిన స్వామిలో ఆధ్యాత్మికతతోపాటు దేశభక్తి మిళితమైంది. స్వామి ప్రసంగాలకు ముగ్ధులైన మద్రాసు ప్రజలు విరాళాలు సేకరించగా 30 ఏళ్ల వయసులో త్యాగభూమి నుంచి భోగభూమి అయిన అమెరికాకు వెళ్లారు. అక్కడ ఎన్నో కష్టాలు ఎదురైనా లెక్కచేయకుండా 1893 సెప్టెంబర్ 11న చికాగోలో ప్రారంభమైన సర్వమత మహాసభలో వివిధ మతాలకు చెందిన ప్రతిని ధులు, దాదాపు 7వేల మంది శ్రోతలు ఉన్నసభలో స్వామి ప్రవేశిం చారు. అమెరికా సోదర సోదరీమ ణులారా నామతం గొప్పదంటే.. కాదు కాదు నామతం గొప్పది కొట్లాడుకుంటున్న కాలంలో కాషాయం కట్టిన ఓ సాధారణ సన్యాసిగా చికాగోలోని సర్వమత సమ్మేళనంలోకి అడుగుపెట్టి ఓ నా అమెరికా సోదర సోదరీమణులారా అంటూ ఆత్మీయ సంబోధనతో ప్రపంచదేశాలకు భారతీయ సోదరభావాన్ని, ఔన్నత్యాన్ని చాటిచెప్పారు. ఆయన ఆత్మీయ సంబోధన విని వేలాదిమంది లేచి రెండు నిమిషాలపాటు చప్పట్లతో ఆనందానుభూతిని వ్యక్తం చేశారు.

## పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలను యజమానులు సరైన తీసుకెళ్ళవచ్చు

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

రాజన్న సిరిసిల్ల,జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు సందర్భాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను మరియు వివిధ సందర్భలలో సీజ్ చేయబడిన వాహనాలను వాహన యజమానులు 6 నెలలలోపు సరైన పత్రాలు చూపెట్టి వాహనాలను తీసుకవేళ్ళచు అని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్లలో పలు సందర్భాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు,యజమానులు తీసుకోకుండా ఉన్న వాహనాలు, గుర్తు తెలియని వాహనాలను జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ కి తరలించినట్లు తెలిపారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 55,ఆటోలు 09, కార్స్ 2, సుమో1, బైక్స్ 43 వాహనాలను ఉన్నాయని తెలిపారు. ఆరు నెలల వ్యవధిలో సరైన ధృవ పత్రాలను చూపించి తిరిగి తీసుకోవచ్చని, ఒకవేళ వాహన యజమానులు లేనియెడల వారి కుటుంబ సభ్యులు సరైన పత్రాలు చూపెట్టి తీసుకవేళ్ళచు అని, లేని పక్షంలో ప్రభుత్వ నిబంధనలను అనుసరించి 6 నెలల తరువాత వాహనాలను వేలం వేయడం జరుగుతుంది అని అన్నారు.వాహన యజమానులు సంబంధిత పత్రాలతో ఈ రోజు నుండి ఆరు నెలల లోపు తడూర్ నందు గల పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో మోటార్ వెహిల్ సెక్షన్ నందు సంప్రదించాలని ఇతరత్రా సమాచారం కోసం 87126 56428 ,90009 10619 ఫోన్ నంబర్లలను సంప్రంచాలని తెలిపారు.వాహన యజమానులు 6 నెలలలోపు తీసుకపోనీ వాహానాలకు వేలం వేయడం జరుగుతుందని, ఈ యొక్క వేల 6 నెలల తరువాత నిర్వహించడం జరిగుతుందని, వేలం ఎప్పుడు అనేది మేము మీకు తెలియజేస్తామని అయన అన్నారు.

## అన్నీ వున్నా పరీక్ష క నిరాకరించారు


రంగారెడ్డి,ఓ పరీక్షా కేంద్రం నిర్వాహకుల అత్యుత్సాహం వల్ల ఓ వైద్యురాలు స్పెషలైజేషన్ కొరకు నిర్వహించే పరీక్షకు హాజరుకాలేక పోయిన సంఘటన కూకట్పల్లి కె.పి.హెచ్.బి కాలనీలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన డా.కూరపాటి సాయి అనూష, ఓబీజీ స్పెషలైజేషన్ కొరకు రాయల్ కాలేజ్ ఆఫ్ ఒబెస్ట్రీషియన్ అండ్ గైనకాలజిస్ట్స్ లో పరీక్షకు నమోదు చేసుకున్నారు. అందులో భాగంగా మొదటి పరీక్షకు విజయవాడలో హాజరవ్వగా, రెండవ పరీక్ష నిమిత్తం హైదారాబాద్ కె.పి.హెచ్.బి కాలనీలోని పియర్సన్ ప్రొఫెషనల్ కేంద్రంలో రిజిస్టర్ చేసుకున్నారు. పరీక్ష నిమిత్తం ఈ రోజు పరీక్షా కేంద్రానికి హజరవ్వగా, సరైన ప్రభుత్వ గుర్తింపు కార్డులు లేవని ఆమెని పరీక్షకు అనుమతికి నిరాకరించారు. తాను నిబంధనల ప్రకారం ఆధార్ కార్డు, పాన్ కార్డు సమర్పించగా గుర్తింపు కార్డులు సరిగ్గా లేవని పరీక్షా కేంద్రంలోనికి అనుమతివ్వలేదు. నిబంధనల ప్రకారం తాను పరీక్షకు కావలసిన పత్రాలతో హాజరైన, నిర్వాహకులు అత్యుత్సాహం వల్ల తాను పరీక్ష వ్రాయలేకపోతున్నానని, తనకు న్యాయం చేయాలని డా.సాయి అనూష విజ్ఞప్తి చేశారు.

## వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి కొండ సురేఖ

ఖమ్మం,ఖమ్మం జిల్లా సత్తుపల్లి డివిజన్ లంకపల్లిలోని గొల్లగూడెం గ్రామంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ వన మహోత్సవం కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి అధికారికంగా ప్రారంభించారు. . వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం వివిధ జిల్లాల పరిధిలోని వేర్వేరు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో రావి, వెదురు, యేగిస, మర్రి, చిందుగ, నేరేడు, యేరుమడ్డి, ఉసిరి, చింత, వేప తదితర 20.02 కోట్ల మొక్కలను నాటనున్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఇవ్వాల్టి నుండి రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభమయింది.ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు గాను బుధవారం ఉదయం బేగంపేట విమానాశ్రయం నుండి మంత్రి సురేఖ, హెలికాప్టర్ లో ఖమ్మం జిల్లా సత్తుపల్లికి బయలుదేరారు. వన మహోత్సవం కార్యక్రమం ప్రారంభించిన తర్వాత సత్తుపల్లిలోని జెవిఆర్ డిగ్రీ కాలేజీలో నిర్వహించే పబ్లిక్ అవేర్ నెస్ మీటింగ్, ర్యాలీలో మంత్రి సురేఖ పాల్గొన్నారు.

## శ్రీగంధం దొంగిలించేందుకు వచ్చిన దుండగులు.. అటవీ అధికారులకు భలే దొరికిపోయారు..!

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో కాల్పుల మోత కలకలం సృష్టించింది. ముళబాగిలు తాలూకా కాశీపుర అటవీ విభాగంలో శ్రీగంధం చెట్లను నరికేందుకు ఐదుగురు దుండగులు వచ్చారు.ఇది గమనించిన అటవీశాఖ అధికారులు తనిఖీ చేసేందుకు వెళ్లారు. దీంతో చెలరేగిన ఉద్రిక్తతల కారణంగా అటవీ సిబ్బంది కాల్పులు జరిపారు. వారిలో ఒకరికి కాలులోకి తూటా దూరడంతో పోలీసులకు దొరికిపోయాడు. అతన్నని తాయలూరు గ్రామానికి చెందిన భత్యప్పగా గుర్తించారు. మిగిలిన దుండగులు అక్కడి నుంచి పారిపోయారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన భత్యప్ప అనే నిందితుడు ఐదుగురు సహచరులతో కలసి కర్ణాటకలోని కర్ణాటకలోని ముళబాగిలు వచ్చినట్లు గుర్తించారు. వారంతా మంగళవారం ఉదయం అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. దొంగలను చూసిన ఫారెస్ట్ గార్డు అనిల్, ఇతర సిబ్బంది తీవ్రంగా హెచ్చరించారు. లొంగిపోకుండా దాడి చేసేందుకు ప్రయత్నించారు దుండగులు. దీంతో ఒక్కసారిగా అటవీ సిబ్బంది కాల్పులు జరిపారు. తూటా తగలడంతో భత్యప్ప దొరికిపోయాడు. అతన్ని చికిత్స కోసం ముళబాగిలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. మిగిలిన దొంగలు అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయారు. పరారైన నిందితుల కోసం పోలీసులు ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు.ముళబాగిలు తాలూకా జమ్మనహల్లి దొడ్డకెరె వద్ద 40 ఎకరాల్లో శ్రీగంధం సాగు చేస్తున్నారు. వేసవిలో చెట్లన్నీ ఎండిపోయాయి. చెరువులోనూ నీరు లేకపోవడంతో కొద్ది రోజులుగా వాటిని నరుక్కుని వెళుతున్న వారి సంఖ్య ఎక్కువైంది. ఈ నేపథ్యంలో అటవీశాఖ భద్రత కోసం సిబ్బందిని నియమించిందని అధికారులు తెలిపారు



# రఘురామ రూటే వేరు...



ఏలూరు, జూలై 3, కనుమూరి రఘురామకృష్ణరాజు పరిచయం అక్కరలేని పేరు. నరసాపురం ఎంపీగా ఆయన 2019 నుంచి 2023 వరకూ వైసీపీలోనే ఉండి ఆ పార్టీకే కంట్లో నలుసుగా మారారు. ప్రతిరోజూ రచ్చబండ పేరుతో మీడియా సమావేశం పెట్టి మరీ పార్టీపైన, అధినేత జగన్ పైన విమర్శలు చేసే రఘురామకృష్ణరాజు గత ఎన్నికల్లో నరసాపురం టిక్కెట్ ఆశించినా దక్కలేదు. ఆ సీటు కూటమిలో పొత్తులో భాగంగా బీజేపీ ఎగరేసుకుపోయింది. ఇక రాజును కాదనలేక, బయట ఉంచలేక టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సిట్టింగ్ ఎమ్మెల్యేను పక్కన పెట్టి మరీ ఆయనకు ఉండి శాసనసభ టిక్కెట్ ఇచ్చారు. కూటమి ప్రభంజనంతో ఆయన ఉండి నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందారు.కూటమి అధికారంలోకి రావడంతో తనకు మంత్రి పదవి గ్యారంటీ అనుకున్న రఘురామకృష్ణరాజుకు చివరకు నిరాశ ఎదురయింది. ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. స్పీకర్ పదవి అయినా దక్కుతుందని భావించినా అది కూడా అయ్యన్నపాత్రుడికి దక్కింది. దీంతో రఘురామకృష్ణరాజుకు మంత్రివర్గంలో ఇక తనకు స్థానం దక్కదని తేలిపోయింది. అయినా ఆయన ఉండిలో తనకంటూ ప్రత్యేకతను నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉండి నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ నిధుల పైన ఆధారపడకుండా నిధుల సేకరణను ఆయన సమీకరిస్తుండటం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. మిగిలిన నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు ఇది ఇబ్బంది కరంగా మారింది. రఘురామకృష్ణరాజుకు పారిశ్రామికవేత్తలు, సినీ పెద్దలతో ఉన్న సంబంధాలతో వారంతా నిధులు ఇస్తున్నారు. ఆ నిధులతో ఉండి నియోజకవర్గం అభివృద్ధి చేపట్టేందుకు సిద్ధమయ్యారు.అందులో ఎంత మాత్రం తప్పు లేకపోయినా మిగిలిన ఎమ్మెల్యేలు అలా ఎందుకు చేయకూడదన్న ప్రశ్న ఇప్పుడు అన్ని నియోజకవర్గాల్లో వినపడుతుంది. మిగిలిన ఎమ్మెల్యేలకు ఇది ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వ నిధులపై తాను ఆధారపడనని పరోక్షంగా రఘురామకృష్ణరాజు చెప్పదలుచుకున్నారా? అన్న ప్రశ్న కూడా వినపడుతుంది. మరోవైపు రాష్ట్ర ఖజానా ఖాళీ అయిపోయి ఉండటం, ఉన్న నిధులు సంక్షేమ పథకాలకు ప్రభుత్వం ఖర్చు చేస్తుండటంతో ఇక ప్రభుత్వంపై ఆధారపడి ప్రయోజనం లేదనకున్న రాజు గారు తన సొంతంగా నిధుల సేకరణకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి మంచి స్పందనే లభిస్తుండటంతో ఉండి నియోజకవర్గం అభివృద్ధిని తాను సొంతంగానే చేస్తానని ప్రభుత్వానికి పరోక్షంగా సంకేతాలను పంపినట్లయిందన్న కామెంట్స్ కూడా వినపడుతున్నాయి.మరోవైపు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కూడా రఘురామకృష్ణరాజు చేసిన వ్యాఖ్యలు పార్టీలో చర్చకు దారితీశాయి. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పింఛన్లను పంపిణీ చేస్తూ ఇచ్చిన కరపత్రంపై ఎన్టీఆర్ ఫొటో లేకపోవడం ఏంటని ఆయన ప్రశ్నించడం ఇప్పుడు పార్టీలో హాట్ టాపిక్ గా మారాయి. వచ్చే నెల పింఛను చెల్లించే సమయంలో ఎన్టీఆర్ ఫొటో పెట్టాలంటూ ఆయన ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఆ కరపత్రంపై కేవలం చంద్రబాబు ఫొటో మాత్రమే ఉండటంతో ఎన్టీఆర్ ఫొటో కూడా ముద్రించాలని పేర్కనడంతో రఘురామకృష్ణరాజు ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టే ప్రయత్నం చేశారా? లేక కేవలం మరిచిపోయిన విషయాన్ని గుర్తు చేశారా? అన్న విషయంపై ఇప్పుడు పశ్చిమ గోదావరి జిల్లాలో టీడీపీ నేతలు చర్చించుకుంటున్నారు.

# అమరావతిపై టీడీపీ వైట్ పేపర్...

విజయవాడ, జూలై 3, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతిలో జగన్ ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని ప్రజల ముందు ఉంచాలని నిర్ణయించుకున్నారు. బుధవారం మొత్తం అమరావతి అంశంపై శ్వేతపత్రం విడుదల చేయనున్నారు.అమరావతిపై తమ ప్రభుత్వ భవిష్యత్ కార్యాచరణను కూడా వెల్లడించనున్నారు. దీనికి సంబంధించి అధికారులతో ఇప్పటికే చంద్రబాబు రివ్యూ చేశారు. ఇప్పటివరకు జరిగిన పనులకు సంబంధించి వ్యవహారాలను శ్వేతపత్రంలో ప్రకటించే అవకాశం ఉంది. గతంలో జరిగిన నిర్మాణాలు, పెండింగ్ లో ఉన్న పనులు, ఏయే పనులు ప్రధానంగా డ్యామేజ్ అయ్యాయి.. ఇలాంటి అంశాలను వైట్ పేపర్ లో ఉంటాయి. అమరావతిని నిర్వీర్యం చేసేందుకు జగన్ ప్రభుత్వం చేసిన కుట్రలు, తప్పుడు కేసులు వంటి వివరాలను కూడా వెల్లడించే అవకాశం ఉంది. అమరావతే ఏకైక రాజధాని అని టీడీపీ నినాదం. ఆ నినాదంతోనే ఎన్నికలకు వెళ్లి భారీ విజయం సాధించారు. గెలిచిన వెంటనే జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఇప్పటికే చంద్రబాబు అమరావతి ప్రాంతంలో ఓ సారి పర్యటించి రైతులతో మాట్లాడారు. సీడ్ యాక్సెస్ రోడ్ నిర్మాణానికి అవసరమైన భూమి ఇంకా కొంత మంది రైతులు ఇవ్వలేదు. వారితో అధికారులు మాట్లాడుతున్నారు. గతంలో నిర్మాణాలకు కాంట్రాక్టులు పొందిన కంపెనీలతో ఒప్పందాలు తీరిపోయాయి. మళ్లీ ఒప్పందాలు చేసుకోవాలా లేకపోతే మళ్లీ టెండర్లు పిలవాలా అన్నదానిపై ఇప్పటికే కసరత్తు పూర్తి చేశారు. నిర్మాణ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడారు. అమరావతిలో మళ్లీ నిర్మాణాలను మరో నెలలో ప్రారంభించాలని గట్టి పట్టుదలగా ఉన్నారు. ఇప్పటికే 70 నుంచి 90 శాతం వరకూ పూర్తయిన భవనాలను అందుబాటులోకి తీసుకు వస్తే చాలా వరకూ వసతి సమస్య పరిష్కారం అవుతుందని ఉద్యోగులంతా ఒకే చోట నిర్వాసం ఉండే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. అదే సమయంలో గతంలో భూములు కేటాయించిన సంస్థలు వెంటనే పనులు ప్రారంభించేలా సంప్రదింపులు జరుపుతున్నారు. చాలా వరకూ భూ కేటాయింపులను జగన్ ప్రభుత్వం రద్దు చేసినప్పటికీ ఆసక్తి చూపించే సంస్థలకు మళ్లీ కేటాయించే అవకాశం ఉంది. దాదాపుగా అన్ని కంపెనీలు మళ్లీ అమరావతిలో నిర్మాణాలు, కార్యాలయాలు, విద్యాసంస్థలు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.ఇప్పటికే ప్రభుత్వ భవనాల కాంప్లెక్స్ ల కోసం భూమిని నోటిపై చేశారు. రెండున్నర లేదా మూడేళ్లలో అమరావతి ప్రభుత్వ భవనాల కాంప్లెక్స్‌లను పూర్తి చేయాలనుకుంటున్నారు. అభివృద్ధి పనులు కొనసాగుతూండగా.. భూములు వేలం వేసి. నిధులు సమీకరించుకోవాలని అనుకుంటున్నారు. ఇలాంటి ప్రణాళికలు మొత్తాన్ని చంద్రబాబు వివరించే అవకాశం ఉంది.

# సామాజిక వర్గాలను దగ్గరయ్యేందుకు...

కర్నూలు, జూలై 3,ఆంధ్రప్రదేశ్ లో కులాల ప్రస్తావన లేకుండా ఏ ఎన్నిక జరగదు. అందుకు కారణం అక్కడ సామాజికవర్గాలదే అధిక ప్రాధాన్యత. ఒక్కొక్క పార్టీకి ఒక్క కులం అండగా నిలుస్తుంది. టీడీపీకి కమ్మ సామాజికవర్గం, జనసేనకు కాపు కులం, బీజేపీకి వైశ్య, బ్రాహ్మణ కులాలు, వైసీపీకి రెడ్డి సామాజికవర్గాలు అనుకూలమన్నది అందరికీ తెలిసిందే. అయితే మొన్నటి ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు చూస్తే మాత్రం కూటమి పార్టీలకు కమ్మ, కాపు, వైశ్య, బ్రాహ్మణ వర్గాలు అండగా నిలిచాయి. బీసీలు కూడా ఎక్కువ శాతం మంది మద్దతు పలికినట్లు ఫలితాల తర్వాత తేలింది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే రెడ్డి సామాజికవర్గం కూడా ఎక్కువ భాగం కూటమి వైపునకు మొగ్గు చూపారన్నదే ప్రధానమైనది. . అందుకు కారణాలు కూడా లేకపోలేదు. 2019 ఎన్నికల ముందు వరకూ జగన్ వెంటనే రెడ్డి సామాజికవర్గం నడిచింది. వైసీపీ పార్టీ స్థాపించిన నాటి నుంచి అన్ని రకాలుగా జగన్ వెన్నంటే నడిచింది రెడ్డి సామాజికవర్గమే. తమ డబ్బులను ఖర్చు చేసి మరీ 2014, 2019 ఎన్నికల్లో రెడ్డి సామాజికవర్గం నేతలు ఖర్చు పెట్టారు. మనోడు అధికారంలోకి వస్తే బాగుంటుందని భావించారు. అందుకే వారు ఆ రెండు ఎన్నికల్లో కసి కొద్దీ పనిచేశారు. కానీ 2014 ఎన్నికల్లో అది అధికారంలోకి రాలేకపోయింది. అయినా సరే రెడ్డి సామాజికవర్గం నేతలలో 90 శాతం మంది పార్టీకి వెన్నుదన్నుగానే నిలిచారు. జగన్ పాదయాత్ర నుంచి పార్టీ విజయం సాధించేంత వరకూ అంటిపెట్టుకునే ఉన్నారు. అధికారంలోకి రావాలని చెమటోడ్చారు. ఉన్న ఆస్తులను అమ్మి మరీ తమ నియోజకవర్గాల్లో ఖర్చు చేసిన వాళ్లు కూడా అనేక మంది ఉన్నారు. కానీ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్ల పాటు రెడ్డి సామాజికవర్గం నేతలను దూరం పెట్టారు. పదవులన్నీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలంటూ కొత్త పల్లవి అందుకుని వారిని వాటిని దక్కకుండా చేశారు. నామినేటెడ్ పదవుల్లోనూ వారికి పెద్దగా ప్రయారిటీ ఇవ్వలేదు.జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం ఓటు బ్యాంకును ఏర్పాటు చేసుకోవడంలోనే నిమగ్నమయి పార్టీకి బేస్ లాంటి రెడ్డి సామాజికవర్గాన్ని పూర్తిగా పక్కన పెట్టారు. కనీసం వారికి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. దీంతో వాళ్లంతా కసి మీద ఉన్నారు. తాము పదేళ్ల పాటు కష్టపడి, సొంత డబ్బు ఖర్చు పెట్టుకుంటే అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పట్టించుకోలేదని మొన్నటి ఎన్నికల్లో రెడ్లు అడ్డం తిరిగారు. దీంతో ఇప్పుడు జగన్ కు తిరిగి సొంత సామాజికవర్గాన్ని దగ్గర చేర్చుకోవడం పెద్ద సవాలుగా మారింది. .రాయలసీమలో కూడా తెలుగుదేశం అధిపత్యం చలాయించడానికి ప్రధాన కారణం రెడ్లు. రెడ్లలో కసి తగ్గింది వైసీ?పీకి దూరమయ్యారని జగన్ కు ఇప్పుడు తెలిసి వచ్చింది. అయితే వారిని తిరిగి దరి చేర్చుకోవడం అంత సులువు కాదు. కాలమే దగ్గరకు చేరుస్తుందన్న నమ్మకంతో జగన్ ఉన్నట్లు కనపడుతుంది. ఎందుకంటే జగన్ పార్టీ ఆఫీసులను కూల్చి వేత పనులను ప్రారంభించడంతో పాటు జగన్ ను ఇబ్బంది పెడుతున్నారన్న సింపతీ మొదలయితే తప్ప తిరిగి వారు చేరరన్న అభిప్రాయంలో ఉన్నారు. ఈసారి అందరితోనూ కలిసేలా, తనకు, నేతలకు మధ్య గ్యాప్ ఉండకుండా ఉండేలా చూసుకునేందుకు జగన్ జాగ్రత్త పడుతున్నారని తెలిసింది. బెంగళూరులో ఉన్న జగన్ ముఖ్యమైన రెడ్డి సామాజికవర్గం నేతలను పిలిపించుకుని ఇదే అంశంపై చర్చించినట్లు తెలిసింది. తనకు సహకరించాలని వారిని కోరినట్లు చెబుతున్నారు. అయితే పూర్తి స్థాయిలో ఆ సామాజికవర్గం మద్దతు లభించాలంటే ఎంతకాలం పడుతుందన్నది మాత్రం ఇప్పుడే చెప్పలేని పరిస్థితి అని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

# ఉద్యోగులకు...ఎన్నాళ్లకు కెన్నాళ్లకు...

విజయవాడ, జూలై 3, ఏపీలో పండుగ వాతావరణం నెలకొంది. పెంచిన పింఛన్ల సొమ్ముతోపాటు మూడు నెలల బకాయిలు కలిపి ఇవ్వడంతో 60 లక్షల మందికి పైగా పింఛన్‌దారులు ఆనందోత్సాహాల్లో మునిగితేలగా...అటు ప్రభుత్వ ఉద్యోగులు, పదవీవిరమణ పొందిన పింఛన్‌దారులు సైతం సంతోషంలో మునిగితేలారు. చాలారోజుల తర్వాత 1వ తారీఖు జీతాలుపడ్డాయోచ్ అంటూ సంబరపడ్డారు. ఏపీలో ఉద్యోగులు పింఛన్‌దారులు సంబరాలు చేసుకుంటున్నారు. ఒకటో తారీఖు వారి ఖాతాల్లో జీతాలుపడటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేంటి...జీతాలుపడితే సంబరాలు చేసుకోవడం ఏంటి? పనిచేసిన తర్వాత ప్రభుత్వ సంస్థ అయినా, ప్రైవేట్ సంస్థ అయినా జీతాలు ఇస్తుంది కదా..ఇందులో సంబరపడాల్సిన పని ఏముంది అనుకుంటున్నారా..? పైగా గవర్నమెంట్ ఉద్యోగం అంటే పిడుగులుపడినా నెలఖారు కల్లా వారి జీతం వారికి వస్తుందన్న నానుడి కూడా ఉంది ఇదా..ఇందులో వింత ఏముంది అనుకుంటున్నారా.? అక్కడే ఉంది మరి అసలు కిటుకు.ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగులు అంటే చాలు ధర్నాలు, సమ్మెలతో పాలక ప్రభుత్వాన్ని గడగడలాడించేవాళ్లు. పెన్‌డౌన్, పెన్‌డ్రైవ్ డౌన్ అంటూ ఉద్యమాన్ని ఉరకలెత్తించేవాళ్లు. ఉద్యోగులు రోడ్డెక్కారంటే పాలక గుండెల్లో రైళ్లు పరుగులెత్తేవి. ఎందుకంటే రాష్ట్రవ్యాప్తంగా వారి యూనిటీ..బలమైన ఉద్యోగసంఘాలకు తోడు..ప్రజలతో ఎక్కువగా మమేకమై ఉండేది వాళ్లే కాబట్టి ఐదేళ్ల తర్వాత తమ పార్టీకి ఎక్కడ ఎసరు తెస్తారోనన్న భయం ఉండేది. కానీ గడిచిన ఐదేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో అటు జగన్మోహన్‌రెడ్డిగానీ, ఇటు కేసీఆర్గానీ ఉద్యోగ సంఘాల కోరలు పీకేశారు. ఉద్యోగులను తమ చెప్పుచేతల్లో పెట్టుకున్నారు. జీతాలు పెంచమని అడిగే ధైర్యం కాదు కాద...నెలనెల జీతాలు ఇస్తే చాలురా దేవుడా అన్నంత పని చేశారు.ఉద్యోగులు బకాయిలు, డీఏలు, ఫిట్‌మెంట్ దేనిపైనా ఉద్యోగులు నోరెత్తే సాహసం చేయలేదు. ప్రతినెల మొదటి తారీఖు రావాల్సిన జీతం కూడా దాదాపు 20వ తారీఖు తర్వాత వచ్చిన సందర్భాలు ఎక్కువే. ప్రభుత్వం ఎప్పుడు జీతం ఇస్తే అప్పుడు తీసుకోవాల్సిందేనన్న పరిస్థితులు కల్పించారు. ఒక్కోసారి రెండోనెలలో కూడా ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఈఎంఐలు కట్టాలని వేడుకున్నా...పాలబిల్లు, సరకులు తెచ్చుకోవాలని ప్రాధేయపడినా వైసీపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు పట్టించుకోలేదు. పెద్దపెద్ద జీతాలు వచ్చేవారి సంగతి సరే...కానీ కేవలం నెలజీతం మీదే ఆధారపడే బ్రతికే చిన్నచిన్న ప్రభుత్వ ఉద్యోగులు వేతనాలు కోసం తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పడరానివారితో మాటలు పడ్డారు. ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగం అంటే గర్వంగా చెప్పుకునే వారు కూడా కిరాణా దుకాణదారుడితోనూ, పాలు, కూరగాయలు అమ్మే వారితోనూ మాటలు పడాల్సి వచ్చింది

.ఏపీలో ప్రభుత్వం మారడంతో ప్రభుత్వ ఉద్యోగుల బతుకుల్లోనూ మార్పులొచ్చాయి. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో జూన్ 1నే ప్రభుత్వ ఉద్యోగుల ఖాతాల్లో జీతాల్లో వేశారు. ముఖ్యంగా పదవీవిరమణ పొందిన పింఛన్‌దారుల ఆనందానికి అవధుల్లేవ్..ఇంటి ఖర్చులకు, మందులకు ఇవే వారికి ఆధారం. దాదాపు అందరి ఖాతాల్లో వేతనాలు జమ అయ్యాయి. దాదాపు నాలుగున్నరేళ్ల తర్వాత మొదటి తారీఖు జీతాలు పడటంతో వేతనజీవులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పాలనలో గాడితప్పిన వ్యవస్థలన్నింటినీ చక్కదిద్దుకుంటూ వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబ..ముందుగా ప్రభుత్వ ఉద్యోగుల సమస్య పరిష్కరించారు.సామాజిక పింఛన్‌దారులకు నాలుగున్నరవేల కోట్లు...ఉద్యోగుల జీతాలకు ఐదున్నరవేల కోట్ల రూపాయలను ఒకేరోజు ప్రభుత్వం పంపిణీ చేసింది. ప్రభుత్వం వచ్చిన పక్షం రోజుల్లోనే దాదాపు పదివేలకోట్ల రూపాయలు అందజేసింది.

# 5 నుంచి శ్రీ మరిడమ్మ ఉత్సవాలు

కాకినాడ, జూలై 3, జులై 5 నుంచి జరగున్న పెద్దాపురం శ్రీ మరిడమ్మ వారి ఉత్సవానికి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఈ ఉత్సవ మహోత్సవానికి రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీమరిడమ్మ వారి దేవస్థానం వారు ఏర్పాట్లు చేస్తున్నారు.మరిడమ్మ ఆషాఢమాసం జాతర మహోత్సవం జూలై 5 నుంచి ఆగస్టు 10 వరకు 37 రోజుల పాటు జరుగుతుంది. జూలై 4 (గురువారం) రాత్రి జాగరణ ఉత్సవంతో జాతర ప్రారంభం అవుతుంది. ప్రధానంగా మంగళవారం, గురువారం, ఆదివారాల్లో భక్తుల తాకిడి భారీగా ఉంటుంది. మిగిలిన రోజుల్లో కాస్త తక్కువగా ఉంటుంది. దాదాపు నెల రోజులకు పైగా జరిగే ఉత్సవం గోదావరి జిల్లాల్లో చాలా విశిష్టత కలిగిన పండగ. ఇతర రాష్ట్రాలు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోని నివాసం ఉంటున్న వారు కూడా ఈ ఉత్సవానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు.రథంపై శ్రీ మరిడమ్మ వారి దివ్యరూప ఉత్సవమూర్తిని విద్యుద్దీపాలంకరణతో సుందరంగా అలంకరిస్తారు. దేవస్థానం వారి పది గరగలతో గరగల నృత్యం చేస్తారు. శ్రీదేవి గరగ నాట్య బృందం, పేపకాయలపాలెం వారిచే గరగ నాట్యం (మహిళలు) చేస్తారు. సామర్లకోట వారిచే కేరళ డ్రమ్స్ కార్యక్రమం ఉంటుంది. అఘోర వేషాల కార్యక్రమం కూడా ఉంటుంది. నాదస్వరం, తప్పెటగుళ్ళు, శూలాల సంబరం, కాళికాదేవి వేషాలు, పొడుపుకాళ్లు, బుట్టబొమ్మలు, కాంతారా వంటి కార్యక్రమాలు ఉంటాయి. జాతర సమయంలో అమ్మవారి కాలక్షేప మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.మరిడమ్మ అమ్మవారి మహోత్సవం ప్రతి సంవత్సరం జేష్ఠ మాసంలోని అమావాస్య నుండి ప్రారంభమై ఆషాడమాసంలోని అమావాస్య వరకు వైభవంగా జరుగుతుంది. రాష్ట్ర నలుమూల నుండి మరిడమ్మ అమ్మవారి దర్శనం కోసం ఎంతో మంది భక్తులు వస్తుంటారు. ఒక్క ఆదివారం రోజునే 40 నుండి 50 వేల మంది వరకు భక్తులు వస్తుంటారు. అలాగే మంగళవారం, గురువారాల్లో కూడా భక్తులు భారీగానే వస్తుంటారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించుకుంటారు.మరిడమ్మ తల్లి దేవాలయం తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో ప్రసిద్ధి చెందింది. 1952లో ఈ దేవాలయం రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధీనంలోకి వెళ్లింది. 17వ శతాబ్దంలో పెద్దాపురంలో మానోజి చెరువుకి అతి సమీపంలో శ్రీ మరిడమ్మ అమ్మవారు వెలిశారు. ప్రస్తుతం మరిడమ్మ తల్లి దేవాలయం ఉన్న ప్రదేశమంతా చిట్టడవిగా ఉండేంది. ఒకసారి ఆ అడవిలో పశువుల కాపరులకి 16 ఏళ్ల యువత కనిపించి నేను చింతపల్లి వారి ఆడపడుచుని నేను ఈ ప్రదేశంలో ఉన్నానని మా వాళ్లకు చెప్పండి అని చెప్పి మాయం అయిందని చరిత్ర చెబుతుంది.ఈ వింతను చూసిన పశువుల కాపరులు వెంటనే చింతపల్లి వారికి జరిగిందంతా చెప్పారు. అంతకు ముందే మరిడమ్మ అమ్మవారు చింతపల్లి వారి కలలో కనిపించి, తనకి మానోజీ చెరువు సమీపంలో ఆలయం నిర్మించాలని ఆజ్ఞాపించింది. ఆ చింతపల్లి కుటుంబ సభ్యులు అంతా ఆ మానోజి చెరువు చుట్టుపక్కల ప్రాంతంలో వారికి పసుపు పూసిన ఒక కర్ర గద్దె అమ్మవారి ప్రతిరూపం దర్శనమిచ్చిందని చెబుతుంటారు. ఈ గద్దెను అక్కడే ప్రతిష్ఠించి తాటాకు పాక వేసి ఆ నాటి నుండి నిత్య దూప, దీప, నైవేద్యములు చెల్లించి ఆరాధిస్తున్నారు.జ్యేష్ఠ అమావాస్యకు పక్షం (పదిహేను రోజులు) ముందు అమ్మవారికి ఉయ్యాల తాడి (తాటి చెట్టు)ని వేస్తారు. ఈ ఉత్సవం రోజు నుండి ముగిసే వరకు అమ్మవారు, ఆమె ఆడపడుచులు అక్క చెల్లెళ్లు ఈ ఉయ్యాల తాడి వద్దే ఆడిపాడి భక్తుల ఆలనా పాలనలు చూస్తారని భక్తులు విశ్వాసం. ఈ ఉయ్యాల తాడిని రైతులు వారివారి పొలాల గట్లమీద ఏపుగా ఎదిగిన తాడిని సమర్పించడానికి ముందుకు వస్తారు.అలా రైతులు ఆలయ కమిటీకి ఆరు నెలల ముందుగానే చెప్పుకోవలసి ఉంటుంది. ఉయ్యాల తాడిని కేవలం భూజాల మీద మాత్రమే దాదాపు 100 మంది దళిత సోదరులు ఊరేగింపుగా డప్పుల



దరువులతో, నృత్యాలతో దారిపొడువునా గ్రామ ప్రజలు, ఆడపడుచులు తాడిలకు నీళ్లతో కడిగి పసుపు, కుంకుమలు రాసి పాత పెద్దాపురం కోటముందు మీదుగా గుడి వద్దకు సాగనంపుతారు. ఆది వారి భుజాల మీదుగా ఆ దారి మీదుగానే గుడివద్ద రావాలని అనాదిగా వస్తున్న ఆచారం.

# వైసీపీ నుంచి ఏసీఏకు విముక్తి

విశాఖపట్టణం, జూలై 3,పూర్తిగా వైసీపీ నేతలతో, విజయసాయి రెడ్డి అల్లుళ్ళు, అనుచరులతో నిండిపోయిన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) వారి కంబంధ హస్తాల్లో నుంచి బయటపడనుంది. వైసీపీ ఉత్తరాంధ్రా ఇన్చార్జి హోదాలో విజయసాయి రెడ్డి వందల కోట్ల ఆస్తులు, డిపాజిట్లు ఉన్న ఏసీఏపై కన్ను వేసి అక్రమ మార్గాల్లో చేతుల్లోకి తీసుకొని పాత కార్యవర్గాన్ని బలవంతంగా పంపించేసి తన మనుషులతో నింపేశారు. ఢిల్లీ మద్యం కేసులో తీహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలోనే తన పెద్ద అల్లుడు పి.శరత్‌చంద్రారెడ్డితో నామినేషన్ వేయించి అధ్యక్షుడిని చేశారు. ఆ నామినేషన్ పత్రాలను పట్టుకువచ్చి ఆయన తమ్ముడు, విజయసాయి సొంత అల్లుడు పి.రోహిత్ రెడ్డి ఆయనకు కూడా తెలియకుండానే అప్పటికప్పుడు నామినేషన్ వేసి ఉపాధ్యక్షుడు అయిపోయారు. ఇక విశాఖలో విజయసాయి బినామీగా పేరుపడ్డ ఎస్ఆర్ గోపీనాథ్ రెడ్డి కార్యదర్శిగా ఎన్నికయ్యారు.ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం భారీ మెజారిటీతో అధికారంలోకి రావడంతో కోట్లలో అక్రమాలకు పాల్పడ్డ ఈ కార్యవర్గానికి భయం పట్టుకొంది. ఇప్పటికే తీవ్ర ఆరోపణలు రావడం, ఫిర్యాదులు వెళ్లడంతో భవిష్యత్‌లో కేసులు, అరెస్టులు లేకుండా స్వచ్ఛందంగా తప్పుకొనేందుకు రంగం సిద్ధం చేసుకొంటున్నట్లు తెలిసింది. ఈ కార్యవర్గం కడప స్టేడియం, పులివెందుల గ్రౌండ్ పేరిట కోట్ల రూపాయల నిధులను దుర్వినియోగం చేసింది. ‘ఆడుదాం ఆంధ్రా’లో కూడా ఏసీఏ దూరి అక్రమాలకు పాల్పడింది. చివరకు విశాఖలో ఉన్న స్టేడియంను మూసేసి దానిని తమ గుప్పెట్లో పెట్టుకొని భోగాపురం వద్ద కొత్త స్టేడియం కట్టాలనే ప్రతిపాదనను తెరమీదకు తీసుకొచ్చింది.విశాఖలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, అన్యాయాలపై ఇప్పటికే దృష్టి సారించిన మంత్రి లోకేశ్ ఏసీఏని చక్కదిద్దే పనులను ప్రారంభించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)కి ఏసీఏ వ్యవహారాలను చక్కదిద్ది కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేసే బాధ్యతలను అప్పగించారు. ఈ కార్యవర్గం అక్రమాలపై పూర్తి ఆధారాలు లోకేశ్ వద్ద వుండడంతో ఆయన ఈ కార్యవర్గాన్ని తప్పించే పనికి శ్రీకారం చుట్టారని తెలిసింది. వారంతట వారు వెళ్లిపోతారా? లేక అరెస్టులు, కేసులకు సిద్ధమౌతారో కనుక్కోమని చెప్పడంతో వారంతా రాజీనామాలకు సిద్ధమైనట్లు తెలిసింది. ఈ వ్యవహారాన్ని సున్నితంగా అమలు చేసే బాధ్యతను కేశినేని చిన్ని స్వీకరించారు. అందులో భాగంగానే ఆదివారం విశాఖ స్టేడియంలో జరిగిన ఆంధ్రా ప్రీమియర్ లీగ్ మూడవ సీజన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి చిన్నితో పాటు క్రీడల శాఖామంత్రి రాంప్రసాదరెడ్డి హాజరయ్యారు.విశాఖ క్రికెట్ స్టేడియం హక్కుదారైన విశాఖ జిల్లా క్రికెట్ అసోసియేషన్‌కు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రూ.24 కోట్ల బకాయి పడింది. ఈ రెండు సంఘాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహణ వల్ల వచ్చే ఆదాయంలో 40 శాతం వీడీసీఏకి ఏసీఏ చెల్లించాలి. ఒప్పందం కుదిరిన తరువాత రెండు పర్యాయాలు మాత్రమే చెల్లించిన ఏసీఏ గత పది సంవత్సరాలుగా వాటా ఇవ్వడం మానేసింది. విజయసాయి కార్యవర్గం కూడా హామీ ఇచ్చి మాట తప్పడంతో ఇప్పుడు రాబోయే కొత్త కార్యవర్గం బకాయి తీరుస్తుందని వీడీసీఏ కార్యవర్గం ఎదురుచూస్తోంది.

# ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే రివ్యూ సమావేశం...





ఎమ్మిగనూరు జూలై 3 విభారె న్యూస్..బుధవారం రోజు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బి వి జయ నాగేశ్వరరెడ్డి మండల ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖ అధికారులతో రివ్యూ నిర్వహించి మండలంలోని వివిధ గ్రామలలో గల ప్రజలకు డ్రైనేజి కాలువలు, రోడ్లు, శానిటేషన్ తదితర సమస్యలు ఏమి లేకుండా ముందస్తు చర్యలు తీసుకొని గ్రామాలలో గల ప్రజలకు పరిశుద్ధమైన త్రాగునీరు అందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కృషి చేసి ఆయా శాఖల అధికారులు అనునిత్యం గ్రామలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరించాలని అధికారులను కోరారు.

# వైభవంగా నందీశ్వరాభిషేకం



-- విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 03 -నంద్యాల జిల్లా మహానంది క్షేత్రంలో బుధవారం ప్రదోష కాలం సందర్భంగా నందీశ్వరుడికి ప్రదోషకాలంలో వైభవంగా నందీశ్వరాభిషేకం జరిగింది. ముందుగా గణపతిపూజ, పుణ్యాహవాచనం,నవదేవతాధ్యానం పీఠపూజానంతరం అభిషేకం, అలంకారం,అర్చన మొదలగు వైదీక కార్యక్రమాలు వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వేద పండితులు దేవస్థానం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లాకు సుపరిపాలన అందిస్తా

---కలెక్టర్ రాజకుమారి---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 03 - నంద్యాల జిల్లా కు సుపరిపాలన అందించేందుకు కృషి చేస్తానని నూతన కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. నూతన కలెక్టర్ రాజకుమారి న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారిని మర్యాదపూర్వకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో బుధవారం కలిసారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారు మాట్లాడుతూ నంద్యాల ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కిందిస్థాయి అధికారులను సమన్వయపరచుకొని చక్కటి పరిపాలన అందించాలని సూచించారు . అలాగే వివాదాస్పదమైన పనులను చేయకుండా అందర్నీ కలుపుకుంటూ పోయి నంద్యాల జిల్లాకు సుపరిపాలన అందించాలని కోరారు. ఈ సందర్భంగా నూతన నంద్యాల జిల్లాకు బదిలీ అయినా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ మంత్రివర్యులు ఫరూక్ గారు సూచించినట్లు నంద్యాలకు సుపరిపాలన అందిస్తానని అందరినీ సమన్వయం చేసుకుంటూ పరిపాలన సాగిస్తానని అన్నారు .

# డోన్ విద్యుత్ శాఖ వారి సందేశం...

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూలై 3 రిజర్వ్ బ్యాంక్ సూచనల మేరకు విద్యుత్ బిల్లు ఏపీ ఎస్పీడీసీఎల్ యాప్ మరియు ఏపీ ఎస్పీడీసీఎల్ సైట్ నుంచి చెల్లించాలని లేదా నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డ్,డెబిట్ కార్డ్,వాలెట్ క్యాష్ కార్డుల ద్వారా చెల్లింపు చేయవచ్చని డోన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డోన్ రూరల్ ఏ. ఈ. నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు

# విద్యార్థుల భవిష్యత్తుకు పునాదివేసేది ఉపాధ్యాయుడే...







విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూలై 3 డోన్ పట్టణం పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న వి.భూకాంతరెడ్డి స్వచ్ఛంద పదవీవిరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డోన్ మండల విద్యాశాఖాధికారి రామనరసప్ప, జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి, యుటీఎఫ్ జిల్లా పూర్వ గౌరవాధ్యక్షులు బాబు, సీనియర్ నాయకులు లక్ష్మయ్య, ఎస్ టి యు రాష్ట్ర నాయకులు వెంకట రమణ మాట్లాడుతూ, భూకాంత రెడ్డి మంచి సౌమ్య శీలిగా, మృదు స్వభావిగా, ఎక్కడ పనిచేసినా మంచి వ్యక్తి గా పనిచేశారు. 1997లో ఎస్ జి టి గా ఉద్యోగం లో చేరి, 2009లో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ గా పదోన్నతి పొందారు. ఆయన ఉపాధ్యాయ వృత్తి లో మొదటగా వెంకటనాయుని పల్లెలో చేరి మంచిపేరు తెచ్చుకున్నారు. ఆతర్వాత చిన్న మల్కాపురం పనిచేశారు.. ప్రమోషన్ తీసుకుని వెల్దుర్తి మండలం, నా.బొయినపల్లెలో 8 సంవత్సరాలుగా పనిచేశారు . చివరగా డోన్ పట్టణం పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు పనిచేస్తూ 30.6.2024 న పదవీ విరమణ చేశారు. ఆ తరువాత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి భూ కాంత రెడ్డికి బంగారు ఉంగరం ఇచ్చి, శాలువా కప్పి పూలమాల సమర్పించి సన్మానించారు. వారితో పాటు డోన్ మండలం యూటీఎఫ్ శాఖ అద్యక్షులు బివై సుబ్బారాయుడు, ప్రధాన కార్యదర్శి గోపాల్, సుమన్, శంకరయ్య, బంధుమిత్రులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకట లక్ష్మి,రవిశేఖర్, శ్రీనివాసులు, జయసుబ్బరాయుడు, సుబ్బారాయుడు, లీలావతమ్మ,, దేవేంద్రప్ప,రాధ, అల్లిపిర, రఘునాథ్, ఎస్తేరమ్మ, భూకాంత రెడ్డి,లక్ష్మీకాంతరెడ్డి, మద్దిలేటి, ఆదినారాయణ, శ్రీనివాసులు, రమేష్ , లక్ష్మి ప్రభావతి, హుస్సేన్ భాను, ప్రసాద్ రావు, ముదిరాజు, మహేష్, అల్లిపీరా, చంద్రుడు , ఉమామహేశ్వర రెడ్డి, గోవిందప్ప, లక్ష్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి.. సిఐటియు



విబారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూలై 3 ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 18 నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పి.నాగేశ్వరరెడ్డి,సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం డిమాండ్ చేశారు.బుధవారం శిగరమాన్ క్రాస్ రోడ్డు నందు ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏపీ సీ ఎన్ ఎఫ్) డోన్,ప్యాపిలి ఉమ్మడి మండలాల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ సీఎన్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రామాంజనేయ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రమాదేవి,రామాంజులు ,జిల్లా కోశాధికారి లత,జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి,గోవిందరాజులు,రామ మద్దయ్య,ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి కోయిలకొండ నాగరాజు,మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని,ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని,18 నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని,ఫీల్డ్ లో పనిచేసే క్రమంలో ప్రమాదాలు జరిగితే ఎటువంటి బెనిఫిట్స్ లేవని ప్రమాద బీమా,పీఎఫ్,ఈఎస్ఐ, సౌకర్యాలు కల్పించాలని,అర్హత కలిగిన వారికి ప్రమోషన్స్ సౌకర్యం తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేనియెడల ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అనంతరం డోన్ మండల ఏపీ సి ఎన్ ఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.గౌరవాధ్యక్షులుగా టి.శివరాం సిఐటియు,అధ్యక్షులుగా ఆర్.మనోహర్,ఉపాధ్యక్షులుగా పి.ప్రసాద్, ఈ.పరమేష్ గౌడ్,ప్రధాన కార్యదర్శిగా యు.రఘురామయ్య,సహాయ కార్యదర్శులుగా జి.తిరుమలి, బి.రవి,కోశాధికారిగా ఎం.శ్రీదేవి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించండి

-----ప్రసాదరావు మండల వ్యవసాయాధికారి

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 03 - రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని నంద్యాల వ్యవసాయాదికారి ప్రసాదరావు పేర్కొన్నారు. బుధవారం నంద్యాల యందు పలు విత్తన శుద్ధి కేంద్రాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. మహాలక్ష్మి అగ్రో సీడ్స్ ,విత్తన శుద్ధి కేంద్రాలలో విత్తనం ప్రోసెసింగ్ విదానాన్ని మరియు



ప్యాకింగ్ విదానాన్ని పరిశీలించారు .తర్వాత విత్తనశుద్ధి కేంద్రంలోని అన్ని రిజిస్టర్ తనిఖీ చేసి మహా లక్ష్మి ఆగ్రో సీడ్స్ నందు నాణ్యత ప్రమాణాలను తెలుసుకోవడానికి 5 వరి విత్తన నమూనాలు తీసి విత్తన ప్రయోగశాల కు పంపడం జరిగిందన్నారు . యజమానులు అందరూ కచ్చితంగా ఫౌండేషన్ రిజిస్టర్ మరియు బ్రీడర్ రిజిస్టర్ నిర్వహించాలని పలు సూచనలిచ్చారు. వ్యవసాయ అధికారి ప్రసాద రావు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రోసెసింగ్ చేసుకునే వారు ప్రభుత్వం నుండి అనుమతి పొందిన రకాలను మాత్రమే మార్కెటింగ్ చేసుకోవాలని ప్రాసెస్సింగ్ ప్లాంట్ రిజిస్టర్ , డిస్పాచ్ రిజిస్టర్ బ్రీడర్ రిజిస్టర్ కచ్చితంగా సక్రమంగా నిర్వహించాలని, అదేవిధంగా విత్తనాలు ప్రోసెసింగ్ చేసేప్పుడు కల్తీలు లేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, అదేవిధంగా ప్యాకింగ్ చేసేప్పుడు కూడా ఒక రకంలో ఇంకో రకం విత్తనాలు కలవకుండా జాగ్రత్త పడాలని, విత్తన బాగ్స్ పై ఆ రకం ప్రమాణాలు అన్ని ఉండేలా చూసుకోవాలని అన్నారు. విత్తన చట్టం 1966 కి అనుగుణంగా వ్యాపారం చేసుకోవాలని లేనిచో విత్తన చట్టం 1966. ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .

# కాచి చల్లార్చిన నీటినే తాగండి

---డాక్టర్ అంకిరెడ్డి అసిస్టెంట్ కమిషనర్



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 03 - పట్టణ ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగండి అని అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం లో డాక్టర్ అంకిరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో గత రెండు రోజులుగా ఏఎన్ఎంలు. ఆశా వర్కర్ల ప్రతి ఇంటిఇంటి కివెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే జ్వరాలు, డయేరియా కేసులు గుర్తింపునకు ఇంటింటి సర్వే ఏఎన్ఎం లు ఆశా వర్కర్లు వెళ్లి వివరాలు సేకరిసేకరిస్తునట్లు ఆయన తెలిపారు .

# 99.66 శాతం పింఛన్ల పంపిణీ

---మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి



----విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 03-నంద్యాల పట్టణంలో 44 వార్డు సచివాలయాల పరిధిలో మంగళవారం రాత్రి నాటికి 99.66 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తయిందని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు . పట్టణంలో 18942. మంది లబ్దిదారులు ఉన్నారు. వారిలో 18878 మంది కి పింఛన్లు అందజేశామని కమిషనర్ నిరంజన్ రెడ్డి తెలిపారు. 64 మంది మాత్రమే మిగిలారని తెలిపారు. వారిలో కొందరు అనారోగ్య కారణాలతో చనిపోయి ఉండవచ్చని తెలిపారు. కొందరు సుదూర ప్రాంతాలకు వెళ్లి ఉండవచ్చు అన్నారు.

# విజయవంతమైన ఉచిత కంటి, గుండె వైద్య శిబిరాలు...




విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూన్ 3 జూన్ నెలలో స్ఫూర్తి సంస్థ ఆధ్వర్యంలో రెండు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి డోన్ పట్టణ గ్రామీణ ప్రజలకు ఎంతోమందికి ఉచిత వైద్య సేవలు, ఉచిత ఆపరేషన్లు చేయించడం జరిగింది. జూన్ 23వ తేదీనాడు కర్నూలు సుశీల నేత్రాలయ, డోన్ వైద్య పాలీ క్లినిక్ వారి సహకారంతో కంటి వైద్య శిబిరం ద్వారా 300 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించి, అందులో ఎంపికైన 38 మందికి ఉచిత శుక్లం ఆపరేషన్లు చేయించడం జరిగింది. అలాగే జూన్ 27వ తేదీ నాడు కర్నూలు కిమ్స్ హాస్పిటల్ డోన్ వైద్య పాలీ క్లినిక్ వారి సహకంతో ఉచిత గుండె వైద్య శిబిరం పెట్టి వందలాది మంది ప్రజలకు గుండె సంబందిత సమస్యలకు ఉచిత పరీక్షలు అందించడం జరిగింది. ఈ రెండు మెడికల్ క్యాంపుల ద్వారా స్ఫూర్తి సేవా సమితి ఎంతోమంది పేద ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా వైద్య సహాయం అందించడం జరిగింది. అందుకు సాకరం అందించిన డోన్ వైద్య పాలీ క్లినిక్ వారికి, కర్నూలు సుశీల నేత్రాలయ వారికి, కిమ్స్ కర్నూలు వారికి ప్రత్యేక ధన్యవాదములు తెలుపుకుంటున్నాము. సంస్థ సభ్యుల, దాతల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని సంస్థ వ్యవస్థాపకుడు స్ఫూర్తి మధు అన్నారు

# ఎన్టీఆర్ భవన్‌పై దాడి కేసు

ఎమ్మెల్యే ఆర్కె అనుచరులుగా గుర్తింపు

అమరావతి,జూలై3: టీడీపీ సెంట్రల్ ఆఫీస్‌పై దాడి కేసులో పోలీసులు వేగం పెంచారు. వైసీపీ పార్టీ చెందిన ఒక్క ఎమ్మెల్సీ ప్రధాన సూత్రధారి అని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. దాడిలో తాడేపల్లికి చెందిన 7 మంది మాజీ ఎమ్మెల్యే ఆర్కే అనుచరులు పాల్గొన్నట్లు నిర్ధారించారు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను పోలీసులు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి 150 మందిపై కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. గుణదల, రాణిగారితోట, కృష్ణలంక, తాడేపల్లి, గుంటుపల్లి, గుంటూరుకు, చెందిన వారే ఎక్కువ మంది దాడిలో ఈ ఘటనలో పాల్గొన్నట్లు గుర్తించారు. దాడిలో పాల్గొన్న నిందితుల కదలికలపై పోలీసులు దృష్టి సారించారు. వైసీపీ నాయకులు అవినాష్, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆర్కే అనుచేరులే టీడీపీ ఆఫీస్‌పై దాడి జరిపినట్లు పోలీసుల విచారణలో బయటపడింది. ÷ూగా.. 2021 సంవత్సరం అక్టోబరు 19న మంగళగిరి సమీపంలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగిన విషయం తెలిసిందే. రాడ్లు, కర్రలు, రాళ్లతో వచ్చిన వైసీపీ కార్యకర్తలు... టీడీపీ కార్యాలయ గేట్లు విరగొట్టి మరీ లోపలకు వచ్చారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**